

నేడు యథావిధిగా మీకోసం కార్యక్రమం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం కార్యక్రమం) నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు నేరుగా సమర్పించు కోవచ్చని, అర్జీలు ముందుగా Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే సమర్పించిన అర్జీల స్థితి లేదా కొత్తగా సమర్పించాల్సిన అర్జీలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే, 1100 నంబర్‌కు కాల్ చేసి నేరుగా సమాచారం తెలుసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రాత సహాయకులు, రిసెప్షన్ కౌంటర్లు, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, తాగునీరు వంటి అన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పంటల్లో నానో ఉపయోగమెంత..?

- నానో యూరియాపై భిన్నాభిప్రాయాలు
- వ్యవసాయశాఖ ప్రచారంపై రైతుల్లో నిరాసక్తి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రతి పంటలో అధిక దిగుబడుల కోసం యూరియాతో పాటు కాంప్లెక్స్ వంటి రసాయన ఎరువులు వాడకం పరిపాటి. ఇటీవల యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది. నానో ఉపయోగంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. సంప్రదాయ పద్ధతిలో రైతులు హరిత విప్లవం వచ్చినప్పటి నుంచి బస్తాల్లో తెల్లటి గుళికల రూపంలో ఉండే యూరియాను పంటలకు వాడుతున్నారు. రైతులు చల్లడానికి తేలికగా ఉంటుంది. కల్తీకి అవకాశం ఉండదు. భూమిలో వేసిన 36-48 గంటల్లోనే ఉపయోగంలోకి వస్తుంది. కాగా యూరియాపై ఇస్తున్న సబ్సిడీ ప్రభుత్వానికి భారంగా మారడం అంతర్జాతీయంగా యూరియా తయారీ ముడిసరుకుల ధరలు పెరగడం రవాణా సమస్యలతోపాటు రైతులు అధికంగా వాడడంతో సారవంతమైన భూములు దెబ్బ తింటున్నాయని ప్రభుత్వం యూరియా సరఫరాను తగ్గిస్తూ వస్తోంది. యూరియా కేవలం 25-30 శాతం మాత్రమే ఉపయోగపడుతుండగా మిగతా వివిధ మార్గాల్లో వృథా అవుతోందని ప్రభుత్వం అభిప్రాయ పడుతోంది. ప్రస్తుతం సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వచ్చింది. ఇది సబ్సిడీ లేని ద్రవరూపంలో ఉండే యూరియా. అర లీటర్ నానో యూరియా 45 కిలోల ఒక్క యూరియా బస్తాకు సమానం. పంట దుబ్బు, పూత దశల్లో 2-4 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయని, పర్యావరణానికి ఎలాంటి హానీ లేదని చెబుతున్నారు. నానో యూరియాపై రైతులలో భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. నానో యూరియా ఎప్పటి నుంచో ఉండగా ఇప్పటి వరకు రైతులకు ఎందుకు తెలియజేయలేదంటున్నారు. పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు ఎందుకు ఉపయోగించలేదుంటున్నారు. ఒక వేళ ఉపయోగిస్తే ప్రదర్శన క్షేత్రాలు పెట్టి రైతులకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నిస్తున్నారు. దీంతో నానో యూరియా వాడకం రైతుల్లో నమ్మకం కలిగించలేకపోతోంది. ఇప్పుడు యూరియా కొరత ఏర్పడటంతో నానో యూరియా ఎందుకు తెరమీదకు వచ్చిందనే రైతుల ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయాయి. చేతి పంపుతో స్ప్రే చేస్తే ఎన్ని మిల్లీ లీటర్ల నానో యూరియా కలపాలి, డ్రోన్‌తో స్ప్రే చేస్తే ఎంత కలపాలనే నిర్దిష్టమైన సమాచారం లేదు. ఒక వేళ పంటకు పిచికారీ చేస్తే సమర్థవంతంగా పనిచేస్తుందని గ్యారంటీ ఇస్తారా, పిచికారీ చేసిన 2-3 గంటల్లో వర్షం పడితే పని చేస్తుందా ఇంతకాలం సిఫారసు చేయనిది ఇప్పుడు వాడాలని దృష్టి మరల్చేందుకు యత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా ఇప్పుడిపుడే నానో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వాడాలని కచ్చితంగా చెప్పలేమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది ఇలా ఉంటే యూరియా కొరత గొడవలు భరించలేక నానో యూరియా వాడాలంటూ వ్యవసాయ శాఖ అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది.



నానో ఎరువుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

నానో ఎరువుల వినియోగం పెరుగుతోంది

నానో ఎరువు వినియోగం క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 5 ఎంఎల్ బాటిల్స్ 1200కు పైగా రైతులు వినియోగించారు. రైతుల అవసరాల మేరకు మరో 10,500 బాటిల్స్ అందుబాటులో ఉంచాము. యూరియా ఇతర రసాయన ఎరువులతో పోల్చుకుంటే నానో ఎరువు వినియోగం లాభదాయకం, పర్యావరణహితం. కేవలం రూ.225 విలువ చేసే ఈ బాటిల్ అరెకరా వరి పంటకు సరిపోతుంది. 25 నుంచి 30 రోజుల మధ్యలో ఒకసారి, అనంతరం 45 రోజుల నుంచి 50 రోజులు మధ్యలో పిచికారీ చేసుకోవాలి. యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వల్ల ఆర్థిక భారం, నేల కాలుష్యం వంటి దుష్ప్రభావాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాము. జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు పెడుతున్నాము. రైతుల నుంచి ఆదరణ లభిస్తోంది.

ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు

ప్రజారోగ్యాన్ని దెబ్బ తీస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపి ప్రభుత్వం వైద్య విద్య మీద, ఆరోగ్యశ్రీ మీద తీసుకున్న నిర్ణయం ప్రజారోగ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ స్థానిక ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై నివేదిక ప్రవేశపెట్టారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ఆరంభించిన 10 మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణం అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు ప్రతిభ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయని, అదే ప్రయివేటు యాజమాన్యాలు సంపన్నులకే సీట్లు ఇస్తాయని తెలిపారు. వ్యాపార దృక్పథం ముందుకు వచ్చి పేద ప్రజలకు వైద్యం అందడం తగ్గిపోతుందని అన్నారు. వైద్యం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని ప్రపంచంలో అనేక దేశాల్లో నిరూపితమయ్యిందన్నారు. ప్రైవేట్ ఆజమాయిషీలో ఫీజులు, అడ్మిషన్లు వాటిలో డొల్లతనం అనేక సందర్భాల్లో బయటపడిందన్నారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను రూ.లక్షలకు అమ్ముకునే జిఒ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే ఇది సాధ్యమని, ప్రభుత్వ వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం కొన్ని పెద్ద జబ్బులకు కొంత ఊరట కలిగించినప్పటికీ పూర్తి పరిష్కారం కాదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, తులసి, జిల్లా కమిటీ సభ్యులు బివిఎన్.పూర్ణిమరాజు, ఎస్ఎస్.మూర్తి, ఎం.సుందరబాబు, ఐ.సుబ్రహ్మణ్యం, బేబీరాణి, కర్రి రామకృష్ణ, రాజా పాల్గొన్నారు

కేశవకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి- కొవ్వూరు

కొవ్వూరు పట్టణానికి చెందిన జికె ఎడ్యుకేషనల్ హెల్త్ కేర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గెల్లా కేశవకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం పాన్ ఇండియా సంస్థ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించింది. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి, డిఇఒ కె.వాసుదేవరావు ద్వారా ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని రౌండ్ పార్క్ వద్ద ఉన్న ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వివి.సత్యనారాయణ, వివిఎస్.కృష్ణ కుమార్, చిలుకూరి శ్రీనివాసరావు, సముద్రాల గురు ప్రసాద్, గుంత స్వామి ఘనంగా సత్కరించారు. పాన్ ఇండియా సంస్థ నిర్వాహకులు అద్దంకి రాజయోన, రెడ్ క్రాస్ సొసైటీ ఇండియా, పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా నిర్వహణ సొమ్ములు ఇవ్వరా..

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ప్రభుత్వం పదో తరగతి పరీక్షలు నిర్వహించి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా విధులు నిర్వహించిన ఉపాధ్యాయాలకు ఇప్పటివరకు నిర్వహణ ఖర్చులు ఇవ్వకపోవడం దారుణమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు ఈ ఏడాది మార్చి ఏప్రిల్ నెలల్లో పదో తరగతి పరీక్షలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు ఈ విధులను పగడ్బందీగా నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. పరీక్ష పేపర్ల మూల్యాంకన విధులు కూడా ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వహించారన్నారు. సొంత ఛార్జీలతో సుదూర ప్రాంతాలకు సైతం మండుటెండల్లో ప్రయాణం చేసి విధులు నిర్వహించిన సిబ్బందికి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఖర్చులు చెల్లించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటివరకు సిబ్బందికి రూ.13 లక్షల మేర చెల్లించారని, ఇంకా రూ.30 లక్షలు చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ఒకటి రెండు నెలల వ్యవధిలో సిబ్బందికి సొమ్ములు చెల్లించేవారని, రెండేళ్లుగా ఈ తాత్సారం జరుగుతోందన్నారు.

వాట్సాప్ పరిపాలన కాదు వాటాల పరిపాలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో వాట్సాప్ పరిపాలన కాదని, వాటాల పరిపాలన అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ విమర్శించారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు స్మార్ట్ మీటర్లలో భారీ అవినీతి దాగి ఉందన్నారు. మెడికల్ కాలేజీల భూముల అమ్మకాల్లో వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లు వేయించుకొని, బిజెపి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. 2019, 2024 రెండుసార్లు కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం దొంగ ఓట్లు వేసుకుని, ఇవిఎం ట్యాంపరింగ్ చేసి అధికారం చేపట్టిందన్నారు. రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన యాత్రలో ఆయన చెప్పిన మాటలు వాస్తవం అన్నారు. రష్యా నుంచి భారతదేశం దిగుమతి అవుతున్న క్రూడాయిల్‌లో భారీ అవినీతి దాగి ఉందన్నారు. మోడీ తన మిత్రులకు ఈ క్రూడాయిల్‌ను ఇస్తున్నారని వెల్లడించారు.

గోదావరిలో కొనసాగిన వినాయక నిమజ్జనాలు

ప్రజాశక్తి-కొవ్వూరు


గోదావరి నదిలో వినాయక నిమజ్జనాల కార్యక్రమం కొలిక్కి వచ్చింది. ఆదివారం చంద్రగ్రహణం రావడంతో కొవ్వూరు పట్టణంలో ఒకటి రెండు మినహా వినాయక విగ్రహాల నిమజ్జనాలు పూర్తి చేశారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల వరకు నిమజ్జనాలు కొనసాగాయి. పట్నంలో 33 విగ్రహాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన మరో 30 విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. శుక్రవారం వరకు 115 విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసినట్టు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా అర్ధరాత్రి వరకు కొవ్వూరు మెయిన్ రోడ్‌లో సందడి నెలకొంది.. యువత ఉత్సాహంతో చిందులు వేస్తూ గణనాథుడికి వీడ్కోలు పలికారు.

రైల్వే అండర్ పాస్‌లో రాకపోకల నిలుపుదల

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దారి-వేలివెన్ను రైల్వే అండర్ పాస్ వద్ద సిసి రోడ్డు నిర్మాణం కారణంగా మంగళవారం నుంచి నెల రోజులపాటు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు ప్రయాణించే మార్గాన్ని రోడ్డు పనుల నిమిత్తం మూసి వేస్తుండడంతో ప్రయాణికులు గమనించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని అధికారులు సూచించారు.

కార్టూ'నిజం'



వైద్యాధికారికి లంచాల రోగం

జన విజ్ఞాన వేదిక నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఆదివారం కె.భీమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు ప్రకృతి-సమాజం-సైన్స్ అనే అంశంపై ప్రసంగించారు. ప్రకృతి నుంచి మానవుడు ఎంతో నేర్చుకున్నాడని, ప్రకృతితో కలిసి నడపడం ద్వారా మానవ పరిణామక్రమంలో ఎన్నో విజయాలు సాధించాడని తెలిపారు. కానీ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం జరుగుతోందని, అది మానవ మనుగడకు ప్రమాదకరంగా తయారయ్యిందని తెలిపారు. మనం పీల్చే గాలి తాగే నీరు కలుషితం చేయడం ద్వారా మానవుని మనుగడకు ముప్పు ఏర్పడుతుందని, కనుక పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, ప్రభుత్వం నడుం బిగించాలని పిలుపు ఇచ్చారు. ఎంఎల్‌సి బి.గోపి మూర్తి మాట్లాడుతూ సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతున్న సభ్యులను అభినందించారు. ప్రస్తుత సమాజానికి జనవిజ్ఞాన వేదిక అవసరం ఎంతో ఉందన్నారు. సైన్స్, మానవులు కలిసికట్టుగా జీవించడం, సమాజ అభ్యున్నతికి పాటుపడడం నేర్పిస్తుందని, మానవ పరిమాణం పరిణామ క్రమం బోధిస్తోందని తెలిపారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి కెఎంఎం.ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ ప్రచార ఉద్యమ కార్యక్రమాలను, భవిష్యత్తు కర్తవ్యాలను గురించి రాష్ట్ర శాఖగా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో చేసిన చెకుముకి పరీక్ష, ఉచిత వేసవి శిక్షణ శిబిరం తదితర కార్యక్రమాలను వివరించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్. రవిబాబు, గౌరవాధ్యక్షులుగా వై.పైడియ్య, ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ చైతన్య శేఖర్, వై.ఆనంద్, సహాధ్యక్షులుగా జి.విశ్వనాథం, రంగవల్లి, విటి.విల్సన్ రాజు, చిలుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా జి.తాతారావు, కార్యదర్శులుగా జిటి.వసంతరావు, జెవివి.సత్యనారాయణ, సిహెచ్ శ్రీరాములు, బివి.ఆనంద్, కృష్ణ సాయి, చెక్క తాతారావు, గోపాల్, ప్రసాద్, గణేష్ బాబు, సిహెచ్ నిశ్చల్, ప్రవీణ్ కుమార్, కొల్లి శ్యాంసుందర్, ఎస్ లక్ష్మీనారాయణ, వి.అచ్చయ్య, సమతా కమిటీ కన్వీనర్‌గా రంగవల్లి, సభ్యులుగా శేషారత్నం, యార్లగడ్డ ఉమాదేవి, ఇసుకపూడి రాజేశ్వరి, ఎస్.అనిత, యూత్ కమిటీ కన్వీనర్‌గా సిహెచ్.నిశ్చల్, సభ్యులుగా ప్రవీణ్ కుమార్, కొండ వినయ్ కుమార్, కోడె హరీష్ కుమార్, సైన్స్, టెక్నాలజీ సబ్ కమిటీ కన్వీనర్‌గా బివి.ఆనంద్ బాబు, కె.కృష్ణ సాయి ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపిమూర్తి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఆరోగ్యకర సమాజం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం సుమారు రూ.9 లక్షలు విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం ఎంఎల్‌ఎ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ సిటీ నియోజకవర్గంలో ఇంత వరకు 211 మందికి రూ.2.41 కోట్ల సిఎం సహాయ నిధి ద్వారా అందజేశామని చెప్పారు. తమ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ళ వైసిపి పాలనలో రాజమండ్రిలో సిఎం సహాయ నిధి నుంచి ఒక్క చెక్కు కూడా ఇవ్వలేదని విమర్శించారు.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌ఎ వాసు

జెసి ఆధ్వర్యాన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. మాల ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎల్.వి.ప్రసాద్, న్యాయవాది మర్రి బాబ్జి, జిల్లా మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ యాత్ర చేపట్టారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి క్వారీ మార్కెట్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులు, ర్యాలీ నిర్వహించారు. తొలుత గోకవరం బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణను ఉపసంహరించాలని, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, మాజీ ఎంపీ జివి.హర్ష కుమార్, టి.అశోక్ బాబు, దాసరి చెన్నకేశవులు, దాసి వెంకట్రావు, తాళ్లూరి రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, ఎలిపే శ్రీనివాస్, ఎన్ఎడి.పాల్, అంబటి సత్యనారాయణ, ఆరే రాము, ప్రభు అంబేద్కర్, మధు, జంగా సుబ్బారావు, గారా త్రినాథ్, ఉల్లం రవి, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- కొవ్వూరు

వైద్య ఖర్చుల నిమిత్తం పలువురికి సిఎం సహాయనిధి ద్వారా చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం కొవ్వూరు టిడిపి కార్యాలయంలో అందజేశారు. తాడిపూడి, తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం, తాళ్లపూడి గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.4,05,519 విలువైన చెక్కులను ఎంఎల్ఎ అందజేశారు. నియోజకవర్గం ద్విసభ్య కమిటీ కంటమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కాకర్ల సత్యేంద్ర, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని సువర్ణ వేణి

సువర్ణవేణికి సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు


ప్రజాశక్తి-కడియం

కడియం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయిని డాక్టర్ బూసి సువర్ణ వేణికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇన్‌స్పిరేషనల్ అవార్డు దక్కింది. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాల్లో అవార్డుల ప్రదానోత్సవ సభలో సువర్ణవేణి అవార్డు అందుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా వరసల రాందాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం సచివాలయ ఉద్యోగుల విస్తృత సమావేశంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ అధ్యక్షతనఉద్యోగులు తమ సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమకు సెలవులు లభించడం లేదని, పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేయాల్సి వస్తోందని వారు ఆవేదన చెందారు. వాలంటీర్ విధులను బలవంతంగా తమపై రుద్దడం, ఇంటింటి సర్వేల పేరుతో పదేపదే ఆత్మగౌరవాన్ని ఉల్లంఘించడం వంటి అంశాలపై ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా వరసల రాందాస్, కన్వీనర్‌గా కోనాల శుభాకర్, కో-చైర్మన్‌గా షేక్ గౌసియా బేగం, కో కన్వీనర్‌గా బాల రజని, గౌరవ చైర్మన్‌గా పి.గిరి ప్రసాదవర్మను ఎన్నుకున్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి- కొవ్వూరు

జిల్లాలో యూరియా కొరత లేదని రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం పసివేదల పిఎసిఎస్‌లో రైతులతో ఆమె మాట్లాడారు. వివిధ పంటలకు యూరియా వాడకం, వినియోగం, సరఫరాలో ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరం మేరకే యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. నానో యూరియా స్ప్రేయింగ్ చేసుకోవడానికి అవసరమైన మేరకు అందుబాటులో ఉందని ఆమె సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించాలన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీ, సొసైటీ, రుణ సదుపాయం గురించి చర్చించారు. రైతులు ప్రకతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని సూచించారు. రైతుకు సైతం ప్రకృతి వ్యవసాయం అనువైనదన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీ, రుణాల పంపిణీపై ఆరా తీశారు. కౌలు రైతులకు సొసైటీ బ్యాంకులో సకాలంలో రుణాలు అందించాలని సూచించారు. ఆర్‌డిఒ రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, సొసైటీ కార్యదర్శి కరుటూరి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాసరావు, ఎఒ ఎ.గంగాధర్, నాయకులు పరిమి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుని వైద్య ఖర్చులకు దాతల సాయం

ప్రజాశక్తి-కడియం

ప్రమాదంలో గాయపడ్డ బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం, దాతల సహకారంతో రూ.70,000 ఆర్థిక సాయం అందించినట్టు నర్సరీ అసోసియేషన్ మాజీ సెక్రటరీ గాధ నాగేశ్వరరావు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలుని వైద్యానికి దాతలు సహకరించాలని కోరారు. కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన కొందరు యువకులు చవితి సందర్భంగా వినాయక విగ్రహం తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మనుమల మణికంఠ తల, కళ్లకి బలమైన గాయాలవడంతో అపస్మారక స్థితికి వెళ్ళిపోయాడు. ఆపరేషన్, వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. సహాయం చేసిన దాతలకు మణికంఠ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మరింత మంది దాతలు సహకరించి తమ కుమారుని ఆదుకోవాలని మణికంఠ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్

గ్రామాభివృద్ధిలో డిఎన్‌ఆర్ చిత్తశుద్ధి

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామాభివృద్ధిలో మాజీ సర్పంచ్ దూడల నాగేశ్వరరావు చిత్తశుద్ధి ప్రశంసనీయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం దుళ్లలోని నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన భార్య మాజీ సర్పంచ్ దూడల రత్నం, కుమార్తె విశ్వశ్రీప్రియ, సోదరుడు దూడల అర్జున్‌ను ఆయన ఓదార్చారు. తాను ఎంఎల్‌సిగాఉన్నప్పుడు నాగేశ్వరరావు తనకెంతో దగ్గరగా ఉండేవారని, గ్రామాభివృద్ధికి తపన పడేవారని తెలిపారు. ఆయన రాజకీయాల్లో కళంకం లేని నాయకుడన్నారు. డిఎన్‌ఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ చిట్టూరి అమ్మిరాజు, ఆదర్శ రైతు కంద రెడ్డి, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, తాతపూడి బాబీ, కూటమి నాయకులు చిక్కాల బాబులు, భరత్, తూము శ్రీనివాస్, వంకా అబ్బు, ముమ్మిడిదేవి నాగేశ్వరరావు, చిక్కాల రాముడు, దూడల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి యువకుని మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలో ఒక యువకుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని దుర్గాడ గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకటేష్(25) శనివారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికినప్పటికీ అతని ఆచూకీ తెలియలేదు. ఆదివారం దుర్గాడ కొత్త చెరువులో అతని మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి కాలు జారి చెరువులో పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మరణించిన గొర్రెలు

కారు ఢీకొని పది గొర్రెలు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-రాజానగరం ఎడిబి రోడ్డులో ఆదివారం కారు ఢీ కొన్న ప్రమాదంలో 10 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

లంకూరు గ్రామానికి చెందిన ఒక యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. తెల్లవారుజామున 4 గంటలకు తల్లి నిద్ర లేచి చూసినప్పుడు తన కుమార్తె కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆమె వాకబు చేసింది. ఆచూకీ లభించకపోవడంతో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో తన కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. తన కుమార్తె కనిపించకపోవడానికి గోపాలపురం గ్రామానికి చెందిన యాళ్ల మణికుమార్ కారణమై ఉండవచ్చని ఫిర్యాదులో తల్లి అనుమానం వ్యక్తం చేశారు.

ఒక వ్యక్తిని కాపాడిన ఎస్ఐ

ప్రజాశక్తి - బిక్కవోలు

కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్ర ఆదివారం కాపాడారు. బిక్కవోలుకు చెందిన 35 ఏళ్ల వ్యక్తి తన భార్య ఆమె అమ్మగారి ఊరికి 3 నెలల క్రితం వెళ్లిపోయిందని కోపంతో, బిక్కవోలు-సామర్లకోట వెళ్లే కాలువలో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో డ్యూటీ రౌండ్స్‌లో ఉన్న బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్, డ్రైవర్ గణేష్ కలసి వెంటనే కాలంలోకి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని నీటిలో పడకుండా కాపాడి, బయటకు తీసుకుని వచ్చారు.



పెద్దేవంలో వైద్య శిబిరం

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఖరీదైన ఆధునిక వైద్య సేవలు అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా అందించాలని ఆలోచనతో గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి నామా ఉషా కిరణ్ అన్నారు. మండలంలోని పెద్దేవంలో ఆదివారం ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో 150 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరానికి హాజరైన ప్రజలకు వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బట్టు సత్యనారాయణ తదితరులు సేవలందించారు.

యూరియా పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలోని రైతులకు 210 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందని మండల వ్యవసాయాధికారి గౌరీదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఈ యూరియాను మండలంలోని 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. కొన్ని సొసైటీల్లో యూరియా అవసరం పెద్దగా ఉండదని, మిగిలిన చోట్ల అవసరం ఎక్కువగా ఉంటుందని దృష్టిలో ఉంచుకుని, ప్రతి సొసైటీకీ 20 మెట్రిక్ టన్నుల (450 బస్తాలు) చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామని గౌరీదేవి వివరించారు. మొత్తం 190 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీలకు, మిగిలిన 20 మెట్రిక్ టన్నులు సీతానగరంలోని గ్రోమోర్ రిటైల్ సెంటర్‌కు చేరుకున్నట్లు ఆమె తెలిపారు. వరి రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా పంపిణీలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులకు ఒకటి నుంచి రెండు బస్తాలు అందజేస్తామన్నారు. కొన్ని సొసైటీల వద్ద యూరియా కోసం టోకెన్లు తీసుకున్న రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సొసైటీలకు యూరియా చేరుకుందని, రెండు రోజులలోగా రైతులకు పంపిణీ చేస్తామని గౌరీదేవి స్పష్టం చేశారు. ఈ పంపిణీ వరి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేస్తామన్నారు.



లారీ నుంచి దింపుతున్న యూరియా

సముద్ర చేప ఉత్పత్తిలో ముందంజ

'ప్రజాశక్తి'తో జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వనరుల రీత్యా సముద్ర చేప ఉత్పత్తిలో కాకినాడ జిల్లా రెండవ స్థానం, బ్రాకిష్ వాటర్, మంచి నీటి రొయ్యల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్నామని మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు అన్నారు. కాకినాడ జిల్లా సువిశాలమైన 119 కి.మీ తీర ప్రాంతాన్ని కలిగి ఉండగా 4 రిజర్వాయర్లు, గోదావరి నదీపాయలు, 137 ఇరిగేషన్ చెరువులు కలిగి ఉండి, దాదాపు 2.84 లక్షల టన్నుల సముద్ర, మంచి నీటి, ఉప్పు నీటి చేపల ఉత్పత్తికి అనుకూలంగా ఉందన్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో మరిన్ని అంశాలను ఆయన పంచుకున్నారు.

సముద్ర మత్స్య పరిశ్రమ పథకం అమలు..?

సముద్ర తీరం 119 కి.మీ. వెంబడి ఫిషింగ్ హార్బర్‌తో కలుపుకుని 23 లాండింగ్ సెంటర్లలో 4609 బోట్లు చేపల వేట చేయడానికి అనుమతి ఉంది. తీరం వెంబడి 42,300 కుటుంబాలు సముద్ర చేపల వేట, దాని అనుబంధ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తీర ప్రాంత భద్రతలో భాగంగా వేట నావలన్నింటికి కలర్ కోడ్ అమలు చేయడంతో పాటు 36,112 మంది మత్స్యకారులకు బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగింది. జిల్లాలో 47 సముద్ర మత్స్య సహకార సంఘాలు 9,206 మంది సభ్యులతో రిజిస్టర్ అయ్యాయి. కాకినాడలో షోర్ స్టేషన్ ఏర్పాటు చేయుట ద్వారా తీరం నుంచి వేట నావకు, వేట నావ నుంచి వేట నావకు సమాచారం విహెచ్ఎఫ్ వ్యవస్థ అందజేస్తున్నాం.

వేట నిషేధం అమలులో మత్స్యకారుల జీవనభృతి..?

మత్స్య సంపదను పరిరక్షించే క్రమంలో ప్రతీ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు సముద్ర వేట నిషేధం అమలు జరుగుతుంది. 2025-26 సంవత్సరంలో 4.583 బోట్లకు సంబంధించిన 27,061 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.54.122 కోట్లు లబ్దిదారుల అకౌంట్‌లలో జమ చేశాము.

మత్స్యకారుల బోట్లకు డీజిల్ సబ్సిడీ..?

ఎపిఎంఎస్ఆర్ యాక్ట్, ఎంఎస్ యాక్ట్ నిబంధనల మేరకు సముద్రంలో వేటకు వెళ్లే 4,609 బోట్లను రిజిస్టర్ చేశాము. ఎప్పటికప్పుడు కొత్త పడవలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాం. సముద్ర వేటకు వెళ్లే 4189 బోట్లకు డీజిల్ సబ్సిడీని ప్రభుత్వంచే గుర్తించబడిన పెట్రోల్ బంకులలో స్మార్ట్ కార్డుల ద్వారా డీజిల్‌ను ముందస్తు సబ్సిడీతో అందచేయడం జరుగుతుంది. 420 మెకనైజ్డ్ బోట్లకు నెలకు 3 వేల లీటర్ల డీజిల్‌పైన, 3769 మోటరైజ్డ్ బోట్లకు నెలకు 300 లీటర్లపైన, ఒక్క లీటరు పై రూ.9 చొప్పున సబ్సిడీ ఇస్తున్నాం.

ఆక్వారైతులకు విద్యుత్ రాయితీ ఎలా..?

కాకినాడ జిల్లాలో 9527.13 హెక్టార్లలో 9095 మంది ఆక్వా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. 10 పది ఎకరాల లోపు ఉన్న ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50 పైసలకు, 10 ఎకరాలున్న ఆక్వా రైతులకు రూ.3.85 పైసలకు చొప్పున 6,537 మందికి సబ్సిడీ చేకూరుతుంది.

హార్బర్ నిర్మాణం ఎంతవరకు వచ్చింది..?

మత్స్యపరిశ్రమ ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణం కోసం రూ.100 లక్షల అంచనాతో 2017-18 నిధులు మంజూరు చేయబడి పనులను ఎగ్జిక్యూటింగ్ ఇంజనీర్, డ్రెయినేజీ డివిజన్ అధికారులు 60 శాతం పనులు చేశారు. మిగిలిన పనులు రాబోయే 2 నెలల్లో పూర్తి అవుతాయి. ఉప్పలంక ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణం కోసం రూ.5.74 కోట్లను పిఎంఎంఎస్‌వై పథకంలో 2022-23 సంవత్సరానికి నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులను ఎపి మారిటైం బోర్డుకి అప్పగించగా ఇటీవల పనులు మొదలయ్యాయి. ఉప్పాడ వద్ద రూ.422 కోట్లు వ్యయంతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతుంది. దీని నిర్మాణ పనులను ఎపి మారిటైం బోర్డు నిర్వహిస్తుంది. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి అయ్యాయి.

మంచినీటి మత్స్య పరిశ్రమ ఎలా ఉంది..?

గోదావరి నది జిల్లాలో శాఖోపశాఖలుగా చీలి సముద్రంలో కలవడం వలన నది పాయల ద్వారా, కాలువల ద్వారా అధిక మత్స్య ఉత్పత్తులు సాధించడానికి వీలుగా ఉంది. జిల్లాలో 4837.40 మంచినీటి విస్తీర్ణం కలిగి 137 మైనర్ ఇరిగేషన్ చెరువుల సొమ్ము రూ.20.97,501, అలాగే 5963 హెక్టార్ల నీటి విస్తీర్ణం కలిగిన 1 రిజర్వాయర్ల సొమ్ము రూ.43,855, అలాగే 1433 ఫసలికి గానూ వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు చెల్లించడం జరుగుతుంది. జిల్లాలో 72 మత్స్యసహకార సంఘాలు 6187 మంది సభ్యులతో రిజిస్టర్ కాబడి వారి పరిధిలో ఉన్న నీటి వనరులపై లీజు హక్కులు లేదా లైసెన్స్‌లు పొంది వేట సాగిస్తున్నారు.

రైతులను మోసం చేస్తున్న చంద్రబాబు: దాడిశెట్టి

ప్రజాశక్తి - కోటనందూరు



దాడిశెట్టి రాజా

సంపద సృష్టిస్తాం అని చెప్పే అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను నిలువ దోపిడీ చేస్తున్నారని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా విమర్శించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత సృష్టించి, ఒక్కొక్క యూరియా బస్తాపైన రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజల వైద్యం కొరకు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ను నిర్వీర్యం చేయాలనే కుట్రను మానుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా వైద్యం చేస్తున్న ఆసుపత్రులకు చెల్లించాల్సిన రూ.3,700 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్యం చేయమని చేతులెత్తేస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు బదులుగా హెల్త్ స్కీమ్ ప్రవేశపెట్టే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలన్నారు.

9న అన్నదాత పోరు కార్యక్రమం

ప్రజాశక్తి-నిడదవోలు

ఎరువులు బ్లాక్ మార్కెట్‌పై వైసిపి ఆధ్వర్యంలో చేపటట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను వంచించిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, పెరవలి ఎంపిపి కాచేర్ల ప్రసాద్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న చంద్రబాబు, లోకేష్(ఫైల్‌ఫొటో)

అవార్డు గ్రహీతకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - గండేపల్లి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ డాక్టర్ యర్రాప్రగడ కృష్ణశ్రీనివాససుబ్బారావు పలువురు అభినందనలు తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆయనకు ఉపాధ్యాయ అవార్డు లభించడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి అని సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు సారథులుగా నిలుస్తారని అన్నారు. తమ యూనివర్సిటీకి చెందిన సుబ్బారావుకు అవార్డు రావడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్లు ప్రో ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ రవితంగజం, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ , ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.రవిశంకర్, ఎస్‌టివిఎస్.కుమార్, వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉచిత కంటి శిబిరం

ప్రజాశక్తి - యానాం

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అర్థాని దినేష్, నాయకులు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కంటి వైద్యులు డాక్టర్ ప్రత్యూష రోగులను పరీక్షించి కేటరాక్ట్ క్లీనింగ్, షుగర్ పరీక్ష, స్కానింగ్ తదితర పరీక్షలు నిర్వహించారు. 60 మందికి కంటి సంబంధ వ్యాధులు ఉన్నాయని, కంటిలో శుక్లాలకు సంబంధించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెక్కల అరుణ్‌కుమార్, తిరుకోటి ఆదిమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా వాసిరెడ్డి

ప్రజాశక్తి - రౌతులపూడి



వాసిరెడ్డి జమీలు

వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా రౌతులపూడికి చెందిన వాసిరెడ్డి జమీలు నియమితులయ్యారు. ఈ పదవితోపాటు, తుని, పెద్దాపురం నియోజకవర్గాలకు సహాయకర్తగా వాసిరెడ్డిని నియమించినట్లు వైసిపి రాష్ట్ర కేంద్రం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ ఉన్నతికి కృషి చేస్తున్న జమీలుకు పార్టీ అధిష్టానం గుర్తింపునిచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆయనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

మూతబడిన ఆలయాలు

ప్రజాశక్తి - శంఖవరం, సామర్లకోట, పెద్దాపురం

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రత్నగిరి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ఆర్జిత సేవలు ప్రారంభం అవుతాయి. అలాగే సామర్లకోట భీమేశ్వరాలయాన్ని ఆదివారం 12 గంటలకు మూసివేశారు. ఆలయాన్ని తిరిగి 9వ తేదీ ఉదయం 9 గంటలకు తెరవనున్నారు. పెద్దాపురంలో మరిడమ్మ, తిరుపతిలోని శృంగార వల్లభ స్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటలకు మూసి వేసినట్లు ఆయా ఆలయాల అధికారులు కె.విజయలక్ష్మి, వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ ద్వారాలను తెరుస్తామని తెలిపారు.

యూరియ లభ్యతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రంలలో యూరియా లభ్యతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో చోడవరం, కొత్తూరు, తోట పేట,వేగాయమ్మ పేట, అన్నయ్యపేట గ్రామ సదస్సులను ఏర్పాటు చేసి రైతులకు యూరియా నిల్వలు, లభ్యత స్టాక్‌ల గురించి వివరించారు. వేగాయమ్మ పేట గ్రామంలో సర్పంచ్ తుకారం, ఎఎంసి ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మేక జానకి రామయ్య పాల్గొన్నారు. కార్యక్రమని ఉద్దేశించి ఎడిఎ నాగ కుమార్ మాట్లాడుతూ మూడు విడతల వాడే యూరియా అవసరానికి సరఫరాచేస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఎటువంటి కొరత లేకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకొంటామని, పంట సాగు విస్తీర్ణం బట్టి అవసరమైన ఎరువులను అందిస్తామని తెలియజేశారు. ముఖ్య అతిథి అక్కల రిశ్వంత్ మాట్లాడుతూ రైతులు అందరూ అపోహలను, నమ్మోదని రాష్ట్రం లో నియోజకవర్గంలోను సరిపడే యూరియా నిల్వలు ఉన్నాయని రెండు రోజులలో యూరియా అందుబాటులోకి వస్తుందని అన్నారు. మండల వ్యవసాయ అధికారి మణిదీప్ మాట్లాడుతూ నానో యూరియా వాడకంపై రైతులకు పూర్తి స్థాయిలో సందేహాలను నివృత్తి చేశారు. నానో యూరియా వలన కలిగే లాభాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి తుకారాం మండల స్పెషల్ ఆఫీసర్ టి నాగలక్ష్మి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులు సాగులో సేంద్రియ వ్యవసాయ విధానాలు అవలంబించి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూసారాన్ని పెంపోందించుకోవాలని తహశీల్దార్ టి సుభాష్ సూచించారు. మండలంలోని ఠా నేలంక సహకార సొసైటీ వద్ద సొసైటీ చైర్ పర్సన్ జి.పుండరీష్ అధ్యక్షతన ఆదివారం యూరియా మరియు ఎరువుల వినియోగం పై రైతులకు అవగహనా సదస్సు జరిగింది. సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై రైతులు సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని అదుపు చేయడం వంటి పద్ధతులు అవలంబించాలన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ జిల్లా మేనేజర్ జి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నానో ఎరువుల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరిం చారు. కార్యక్రమం లో కోమానపల్లి సొసైటీ చైర్ పర్సన్ పొద్దోకు నారాయణ రావు, వ్యవసాయ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ లతో పాటు రైతులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వినియోగం రైతులకు మేలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నానో ఎరువులు వినియోగించడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గి లాభాల పొందవచ్చని తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎఒ బి.రవి అన్నారు. ఆదివారం మండలంలోని నేలటూరు, నిడసనమెట్ట,వడ్లమూరు, గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటకు సంబంధించి మూడో విడత యూరియా అవసరం కాగా వాటిని సరఫరా చేశామన్నారు. మార్కెట్లో నానో ఎదవులు కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

చేయూత అందించిన సేవా సమితి

ప్రజాశక్తి - రావులపాలెం

గ్రామానికి చెందిన పూరి సరస్వతి షుగర్ వ్యాధితో నడవలేని స్థితిలో ఉంది. ఆమె ఆర్థిక లేమితో కొట్టుమిట్టలాడడం, ఆమె భర్త కూలీగా పని చేస్తూ వైద్యం చేయించలేని పరిస్థితి. అయితే బాధిత కుటుంబం అమ్మ సీతమ్మ సేవా సంస్థ సభ్యులను సహకారం కోరారు. ఆదివారం సంస్థ సభ్యులు సానబోయిన బాలాజీ ఆధ్వర్యంలో వారు గృహం వద్దకు వెళ్లి రూ.5వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో పాశం చింతరావ్ యాదవ్, సానబోయిన బుజ్జి, శ్రీకాంత్, రామకృష్ణ ,మోటూరి శీను, పితాని శివ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - మామిడికుదురు

హుస్సేనే ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మామిడికుదురులో ఆదివారం జరిగిన సమావేశంలో 25 మంది పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, వందమంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మీర్జా ఖాదం హుస్సేన్ మాట్లాడుతూ 53 ఏళ్ల నుంచి అసోసియేషన్ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. టెన్త్‌లో 500 మార్కులు దాటిన వారికి, ఇంటర్లో 900 మార్కులు దాటిన ప్రతిభా వంతులకు దుర్ హమీ తఖీ హైదర్ ఖాసానీ స్మారకార్థం రిజ్వా నుల్ హాసన్ మెమెంటోలు అందించారు 2025 డిఎస్‌సిలో ఎంపికైన ముస్లిం అభ్యర్థులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆగా హుస్సేన్, కల్బే అబేద్ మా జింద్రాణి, ఎండి అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రముఖులు

పాపారాయుడుకు వైసిపి నాయకుల అభినందన

ప్రజాశక్తి - మండపేట

వైసిసి రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి నియమితులైన కర్రి పాపారాయుడుకు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మండపేట విజయలక్ష్మినగర్‌లోని వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులు పాపారాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వైసిపి అధినేత వైఎస్.జగన్ రెండోసారి అవకాశమిచ్చి రాష్ట్ర కార్యదర్శి పదవి పాపారాయుడుకు అప్పగించడం ఆయన నిబద్ధతకు గుర్తింపు అన్నారు. అలాగే రాజోలు, అమలాపురం నియోజకవర్గాల పరిశీలకునిగా అదనపు బాధ్యతలు అప్పగించడం ఆయన పనితనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు కురుపూడి భవాని, రాంబాబు, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ అడబాల బాబ్జి, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, పార్టీ నాయకులు పెంకే గంగాధర్, మీగడ శ్రీనివాస్, వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, వనుం నారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, పమిడిపల్లి నానాజీ,తదితరులు, పాల్గొన్నారు.

వైసిపి రైతు పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

యూరియా కొరతపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వైసిపి పోరుబాటలో భాగంగా ఈ నెల 9న కొత్తపేట ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వైసిపి ధర్నా నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఆదివారం మండలంలోని చొప్పెల్లలో జడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామాలక్ష్మి రాంబాబు నివాసం వద్ద మండల వైసిపి నాయకులు, రైతులతో కలిసి రైతు పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు.యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. నాయకులు, కార్య కర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నామాల శ్రీనివాస్, నాంద్ర నాగమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - అంబాజీపేట

నందంపూడి నుంచి తొండవరం హైస్కూల్‌కు వచ్చే రోడ్డు వరద ప్రభావంతో జలమయమైంది. హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు నాలుగు రోజుల నుంచి వరద నీటిలో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. డ్రెయినేజీ లేక రోజుల తరబడి నీరు నిలిచిపోయి రాకపోకలకు స్థానికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వరద నీటికి భయపడుతున్న విద్యార్థులను జనసేన గ్రామ శాఖ నాయకుడు బెండా శ్రీనివాసరావు రోడ్డు దాటించారు. వరద నీరు మళ్లించే చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను కోరారు.

అవార్డు గ్రహీత సత్తిబాబుకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

బోధిధర్మ అవార్డు గ్రహీత కుంగ్‌ఫూ మాస్టర్ సత్తిబాబును ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అభినందించిన ఘనంగా సత్కరించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో జొన్నాడకి చెందిన సత్తిబాబు ఈ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావును వాడపాలెం ఆయన నివాసంలో సత్తిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అనేది ఎంతో నైపుణ్యంతో కూడుకుందన్నారు. కుంగ్‌ఫ్యూ కరాటే బాలలంతా విద్యార్థి దశలోనే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మ రక్షణ కోసం ఈ మార్షల్ ఆర్ట్స్ లో ప్రత్యేకంగా మెలకువలు నేర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి, తాడి సూర్యతేజ రెడ్డి, నానీబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో వైసిపి కార్యకర్తల చేరిక

ప్రజాశక్తి - మండపేట

కేశవరం గ్రామానికి చెందిన 26 మంది వైసిపి కార్యకర్తలు ఆదివారం టిడిపిలో చేరారు. మండపేట మండల టిడిపి అధ్యక్షులు కర్రి తాతరావు ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరందరికీ ఎంఎల్ఎ వేగుళ్ళ టిడిపి కండువాను కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు వారంతా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, గుడ్ల ఈశ్వరరావు, ఉండమట్ల పనసరామన్న తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE, KAKINADA
O.S.No.147 / 2025
Between:
Doma Govindu ...Plaintiff
and
Vadrevu Vijaya & others ...Defendants
Defendants:
D2: Vadrevu Bharathi, D/o (Late) Paramesh @ Paremeswararao, Hindu, Aged 27 Years, House Wife, D.No.47-1-121,Canal Road, Gowri Shankar peta, Near Ramalayam, Jagannacikpur, Kakinada.
D3: Vadrevu Vara Lakshmi @ Chinni, D/o (Late) Paramesh @ Paremeswararao, Hindu, Aged 26 Years, House Wife, D.No. 47-1-121,Canal Road, Gowri Shankar peta, Near Ramalayam, Jagannacikpur, Kakinada.
D4: Vadrevu Rajesh, S/o (Late) Paramesh @ Paremeswararao, Hindu, Aged 25 Years, Employee, D.No.47-1-121, Canal Road, Gowri Shankar peta, Near Ramalayam, Jagannacikpur, Kakinada
పై నెంబరు దావాలో 2 to 4 ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.15-09-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును. (కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
బోయనపల్లి రాధాకృష్ణ
A.అనిల్‌కుమార్ రాజా
అడ్వకేట్స్, డో.నెం.6-1-9, జవహర్ వీధి
కాకినాడ, కాకినాడ జిల్లా, సెల్: 9440323951

పాస్‌పోర్ట్ పడిపోయింది
అల్లవరం మండలం బోడసకుర్రు అంబేద్కర్ కాలనీకి చెందిన జల్లి మురళి S/o సత్యనారాయణ కు చెందిన **W 8086023** నెంబరు గల పాస్ పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 18 మే 2025న బోడసకుర్రు, అంబేద్కర్ కాలనీ లో మా ఇంటి నుండి తుమ్మలపల్లి వెళ్తూ ఉండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.
జల్లి మురళి
S/o సత్యనారాయణ,
బోడసకుర్రు పాలెం, బోడసకుర్రు,
అంబేద్కర్ కాలనీ, అల్లవరం మండలం- 533215
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 8008855427.

ప్రకటన
మహారాజశ్రీ గౌరవనీయులైన
సివిల్‌జడ్జి(జూనియర్ డివిజన్) ప్రత్తిపాడు
I.A.421/2016, O.S.98/2016
Between:-
దేవారపు సత్యనారాయణ ...పిటీషనరు/వాది
మరియు
దేవారపు నూకరాజు మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
పిటీషనరు/వాది అయిన దేవారపు సత్యనారాయణ రెస్పాండెంట్స్/ప్రతివాదులు అయిన దేవారపు నూకరాజు అనే ప్రభుదాసు వగైరాలపై గౌరవనీయ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో **I.A.421/2016, O.S.98/2016** అను దావాను దాఖలు చేసినారు. సదరు దావాలో 3వ రెస్పాండెంటు/ప్రతివాది అయిన దేవారపు అప్పారావు తండ్రి తమ్మయ్యగారు మరణించగా గౌరవనీయ కోర్టువారి ఆదేశాల మేరకు వారి వారసులు అయిన దేవారపు నిరాకరమ్మ భర్త అప్పారావు, దేవారపు థామస్ తండ్రి అప్పారావు, దేవారపు బేబీరాణి తండ్రి అప్పారావు, దేవారపు అరుణ తండ్రి అప్పారావులను రెస్పాండెంట్స్/ప్రతివాదులుగా చేర్చడం జరిగింది. వారికి గౌరవనీయ కోర్టువారి నుండి ఎన్నిసార్లు నోటీసులు/సమన్లు పంపినా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. పైన పేర్కొన్న రెస్పాండెంట్స్/ప్రతివాదులుగా హాజరుకై శ్రీయుత కోర్టువారు **ది.09-09-2025**వ తేదీన వాయిదా వేసినారు. **ది.09-09-2025**వ తేదీన పైన పేర్కొన్న రెస్పాండెంట్స్/ప్రతివాదులు పై కోర్టులో స్వయంగా గానీ, ప్లీడరుగారు ద్వారా కానీ **ఉదయం10.30ని॥లకు** హాజరయి తమ ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసు కొనవలెనని, లేని ఎడల వారి పరోక్షమున కేసు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
బుగత వెంకట శివన్నారాయణ
అడ్వకేట్, ప్రత్తిపాడు
సెల్.9849064436

ఒరిజినల్ దస్తావేజు పోయినది
కోట కృష్ణమూర్తి తండ్రి వెంకట శివ సీతారామ శర్మ, డో.నెం.79-6-11, పోస్టల్‌కాలనీ పాత సోమాలమ్మ గుడి శ్యామలనగర్ రాజమండ్రి తూర్పుగోదావరిజిల్లాలో నివసిస్తున్న నేను నాకుమారుడు కె.వి.ఎన్.రఘువీర్ కి చెందిన ఒరిజినల్ దస్తావేజు **1148/2015. ది.28-01-2015** SRO బీమవరం **RS.No.280/2,** ప్లాట్ నెంబర్ **62లో** గల **500చ॥లు స్థలం,** బీమవరం గ్రామపంచాయితీ జగ్గయ్యపేట కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ నెంబర్లు గల దస్తావేజు **ది.25-08-2025**వ తేదిన నేను ఇంటి నుండి శ్యామలనగర్ పాత సోమలమ్మ గుడి వద్ద బ్యాంక్ ఋణం నిమిత్తం వెళ్ళుచుండగా పడిపోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది పోన్ నెంబరుకి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.
కోట కృష్ణమూర్తి
9000694949

పాస్ పోర్టు పడిపోయినది
డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, లక్ష్మీపోలవరం గ్రామానికి చెందిన తలపాకుల సత్యనారాయణ గారి కుమారుడు తలపాకుల నాగరాజు అను నేను **ది.01-09-2025 సం॥ర॥** తేదీన నా పాసుపోర్టును **నెం X 3281264** తీసుకుని లక్ష్మీపోలవరం గ్రామంలో మా ఇంటి వద్ద నుండి రావులపాలెం సెంటర్ లో జిరాక్స్ వద్దకు నా పాస్‌పోర్ట్ స్కాన్ చేయించుకుని మెయిల్ పెట్టించుకోవడానికి గాను వెల్లుచున్న సమయంలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎక్కడో జారి పడిపోయినది. నా పాస్‌పోర్టు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్ కు ఇవ్వగలరు
తలపాకుల నాగరాజు
లక్ష్మి పోలవరం గ్రామం రావులపాలెం మండలం
డా బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్. 9704338883